ఘనంగా శ్రీ తిరుపతి గంగమ్మ జాతర చాటింపు

కుప్పం, మే 6 ప్రభాతవార్త

కుప్పం గ్రామ దేవత శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి మంగళవారం అర్ధరాత్రి చాటింపు వేశారు. ఉదయం ఏడు గంటలకు అమ్మవారి ఆలయం ఎదుట ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, పూజారుల బృందం, స్థానిక నేతలు కొడిమానుకు పూజ నిర్వహించారు. అనంతరం పాతపేట వద్దగల పెద్ద బావి దగ్గర గంగపూజ జరిపారు. అనంతరం అమ్మవారికి ఆలయంలో అభిషేకం, మధ్యాహ్నం పన్నెండు గంటలకు అంబలిపోసే కార్యక్రమం, రాత్రి హద్దులపూజ, అర్ధరాత్రి దాటాక అమ్మవారి జాతర చాటింపు నిర్వహించారు. కాగా అమ్మవారి ఆలయం ఉదయం నుంచే మహిళా భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారి ఆలయం వద్ద అంబలి చేసి పంచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయం వద్ద కొడిపూజ, ప్రత్యేక పూజల దృశ్యం

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

స్థూల జాతీయోత్పత్తిలో

తిరుపతి జిల్లా 3వ స్థానం

జిల్లా పరిశ్రమల అభివృద్ధికి తిరుపతి జిల్లా అనుకూలం - ఎంటీ కృష్ణబాబు

- మొదటి స్థానానికి వచ్చేలా కృషి - కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మే 6 ప్రభాతవార్త ః

రాష్ట్రంలో తిరుపతి జిల్లా స్థూల జాతీయోత్పత్తిలో మూడవ స్థానంలో ఉంది. రాబోయే రోజుల్లో మొదటి స్థానానికి వచ్చేలా కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఇంచార్జి జోనల్ ఆఫీసర్ ఎం.టి కృష్ణ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫెరెన్స్ హాల్‌లో జిల్లా సమగ్ర అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల అమలుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇంచార్జి అధికారి ఎం.ఇ కృష్ణబాబు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కృష్ణబాబు మాట్లాడుతూ తిరుపతి జిల్లా స్థూల జాతీయోత్పత్తిలో రాబోయే కాలంలో నెం.1 స్థాయికి వచ్చేలా అధికారుల సమన్వయం ఎంతో అవసరం అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మూడవ స్థానంలో ఉన్న తిరుపతి జిల్లాను నెం.1 స్థాయికి తీసుకుని వచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీఆర్వో నరసింహులు, కమిషనర్ మౌర్య, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాని, సూళ్ళూరుపేట, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలు కిరణ్మయి, రామ్మోహన్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మ జాతర ఆరంభం

-అర్ధరాత్రి చిరుజల్లుల నడుమ చాటింపు

తిరుపతి(రవాణా),మే 6ప్రభాతవార్త:

తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతర వారంరోజుల వేడుకలు మంగళవారం అర్ధరాత్రి చాటింపుతో చిరుజల్లుల నడుమ మొదలయ్యాయి. మంగళవారం ఉదయం గంగమ్మ ఆలయంప్రాంగణంలోని అమ్మవారి విశ్వరూప స్థూపానికి ఆలయ అర్చకులు మంత్రోచ్చరణలతో విశేష అభిషేకాలు జరిపించారు.ఒడిబాలు కట్టారు. అర్ధరాత్రి తిరుపతి రూరల్ శివార్లలోని అవిలాల గంగమ్మపుట్టింటి నుండి సారెను తీసుకువచ్చి చాటింపుతో జాతర సందడి మొదలైంది. వారంరోజులపాటు తిరుపతివాసులు గ్రామ పొలిమేరలు కూడా దాటరు. భారీ భద్రత, సిసికెమెరాలు ఏర్పాటు చేశారు. 13వతేదీ వరకు జరిగే తాతయ్యగుంట గంగమ్మజాతరలో రోజుకో వేషంలో భక్తులు మొక్కులు తీర్చుకోగా అమ్మవారిని వివిధ వేషధారణల్లో అలంకరించి భక్తులకు దర్శనం చేసుకుంటారు. ఈ అభిషేకపూజల్లో ఆలయ ఫెస్టివల్ కమిటీ ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, ఆర్‌సి మునికృష్ణ, మబ్బుదేవనారాయణరెడ్డి, సభ్యులు, ఈలయ ఈఓ జయకుమార్, అర్చకులు పాల్గొన్నారు.

మబ్బులచాటున శ్రీకాళహస్తీశ్వరాలయం

పరవశించిన భక్తజనం

శ్రీకాళహస్తి, మే 6 ప్రభాతవార్త

మబ్బులచాటున శ్రీకాళహస్తీశ్వరాలయం దాగింది. ఈచిత్రం ఎప్పటితో కాదు. మంగళవారం మండుతున్న వేసవికి తోడు మద్యాహ్నం నుంచి ఓ వైపు మబ్బులు కనువిందుల చేశాయి. దీంతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వామివారి గోపురంతో పాటు నవయుగ రాజగోపురం, మరోవైపు ఆలయం ముందు ఉన్న దక్షిణామూర్తి ధ్వజస్తంభానికి వరుణదేవుడు అభిషేకంలా వర్షం పడడంతో భక్తులు, స్థానికులు సంబపడ్డారు.ఈదృశ్యం పలువురు భక్తులు, స్థానికులను అందరినీ ఆకర్షించింది. అకాల వర్షంతో స్థానికులు కాస్తా ఉపశమనం పొందారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు మే 6 ప్రభాతవార్త:

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.

అగ్రగామి జిల్లాగా

తీర్చిదిద్దడమే లక్ష్యంగా విధులు

మామిడికి గిట్టుబాటు ధర - భూగర్భ జలాలు పెంపుకు చర్యలు

మంచినీటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు

జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి.

చిత్తూరు, మే 6 ప్రభాతవార్త: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో చిత్తూరు జిల్లాను అగ్రగామి జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు కంకణం కట్టుకుని విధులు నిర్వర్తించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అటవీశాఖ అధికారి ధరణి తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జీ మంత్రి మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాల పెంపుకు ఉద్యమ స్థాయిలో చర్యలు చేపట్టాలని, జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, మామిడి రైతుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నారని, మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ నిరుపేద పిల్లలకు మానసిక వికాసం, పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, ఉపాధి, ఎంపి ల్యాడ్స్ నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పనపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో ఎక్కడా మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కా చర్యలు తీసుకోవాలని ఎంపీ దగ్గుమళ్ళ జడ్పీ సిఇఓ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మామిడి దిగుబడి అధికంగా వుండటంతో ప్రాసెసింగ్ కంపెనీల వారి వద్ద వున్న పల్ప్ ఎగుమతికి సంబంధిత శాఖతో చర్చిస్తామన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని 31 మండలాల్లో భూగర్భ జలాల నీటి మట్టంకు సంబంధించి గుడుపల్లి మండలం చివరి స్థానంలో వుందన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో సైతం భూగర్భ జల మట్టం తక్కువగా వుందని ఇక్కడ ఉపాధి నిధులతో పనులు చేపట్టి భూగర్భ జల పెంపుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం మామిడి గిట్టుబాటు ధర రూ.25 వేలు వుందని, మామిడి రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నుండి ప్రోత్సాహకాలు అందేలా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలన్నారు. జిల్లాలో మామిడి దిగుబడి అధికంగా వుండటంతో పల్ప్‌ను టిటిడి ద్వారా భక్తులకు అందజేసేలా ప్రజా ప్రతినిధుల సహకారంతో టిటిడికి లేఖ రాసి వారు సూచించే నాణ్యతా ప్రమాణాలు, ధరలు సంబంధిత అంశాలపై చర్చించడానికి ఏర్పాటు చేసే కమిటీలో ప్రజా ప్రతినిధులు, మామిడి రైతులను భాగస్వాములు చేయడానికి, టిటిడి ద్వారా కమిటీ నియమాకానికి చొరవ చూపాలన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య నిపుణుల సంఖ్య పెరగాల్సిన అవసరం వుందని, ప్రైవేటు ఆసుపత్రులకు రెఫరల్స్ తగ్గాలని, అత్యవసర వైద్య సేవల కోసం వేలూరు సిఎంసి, స్విమ్స్ ఆసుపత్రులకు వెళ్ళనవసరం లేకుండా సదుపాయాలు ఏర్పాటు చేయాలని అపోలో యాజమాన్యంకు సూచించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ జిడినెల్లూరు నుండి చిత్తూరు వైపుగా తిరుపతికి వెళ్ళే భారీ వాహనాలు కట్టమంచి చెరువు వైపుగా వెళితే చిత్తూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పెద్దగా వుండదని, ఈ రోడ్డు నిర్మాణంను త్వరితంగా పూర్తి చేయాలని కోరారు. చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోందని, ఈ ఆసుపత్రికి సంబంధించి సమగ్ర నివేదికను అందించాలని ఎమ్మెల్యే డిసిహెచ్ఎస్‌ను కోరారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ యాదమరి, తవణంపల్లి మండలాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా వుందని సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. జిల్లాలో గత పదేళ్ళుగా సరాసరి వర్షపాతం బాగుండటంతో భూగర్భ జలమట్టం బాగుందని, సాగునీరు ఎక్కువ అవసరం అయిన చెరకు, వరి, వేరుసెనగ పంటల సాగు క్రమంగా తగ్గిందని, అధిక మొత్తంలో నీరు అవసరం లేని మామిడి సాగు 50 వేల హెక్టార్ల నుండి 1.50 లక్షల హెక్టార్ల వరకు పెరిగిందని, పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భూగర్భ జలాల పెంపుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో ప్రతి కుటుంబం మామిడి పంటపై ఆధారపడిందని, ఈ పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. మామిడి పంటకు సంబంధించి పండించే సమయంలో వాతావరణ పరిస్థితుల నుండి అంతర్జాతీయ మార్కెటింగ్ విధానం వరకు అభివృద్ధి చెందేలా పరిశోధనా కేంద్రంను చిత్తూరు జిల్లాలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, డ్వామా పిడి రవికుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం అదనంగా టోకెన్ కౌంటర్లు

శ్రీవారిమెట్టు మార్గంలో పెరగనున్న ఉచిత బస్సులు

టిటిడి ఈఓ ఈఓ జె.శ్యామలరావు

చంద్రగిరి, మే 6 ప్రభాతవార్త:

తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యార్థం శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం అదనంగా మరికొన్ని దర్శన టోకెన్ల కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. శ్రీవారిమెట్టు మార్గంలో భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులపై సమాచారం అందుకున్న ఈఓ మంగళవారం అదనపు ఈఓ చిదంబరం వెంకయ్య చౌదరి, జెఈఓ వి.వీరబ్రహ్మంతో కలసి ఈ మార్గంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉచిత బస్సుల సంఖ్య తక్కువ కావడం, ఆటో డ్రైవర్లు భక్తులను నిలువుదోపిడీకి గురి చేస్తున్నట్లు గ్రహించారు. ఇకపై ఆటో డ్రైవర్ల ఆగడాలను నిలువరించేందుకు శాశ్వత నిర్ణయం తీసుకుంటూ ఉచిత బస్సులను అదనంగా ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. శ్రీవారిమెట్టు మార్గంలో ఆటో డ్రైవర్ల మోసాలను నిలువరించడం, భక్తులకు రవాణా సౌకర్యాలను పెంపొందించడం, టోకెన్ల జారీలో ఇబ్బందులను తొలగించడం అత్యంత ప్రాధన్యత కలిగిన అంశాలుగా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ మార్గంలో భక్తులకు పూర్తి సౌకర్యాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, ఎస్ఈలు వెంకటేశ్వర్లు, మనోహరం, టిటిడి చీఫ్ పిఆర్ఓ రవి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, డిప్యూటీ ఈఓ లోకనాధం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి

-ఆరోగ్య వైద్య, కుటుంబశాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణబాబు

తిరుపతిరూరల్, మే06 ప్రభాతవార్త:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని, పిల్లలు, గర్భవతులకు సరైన సమయంలో వాక్సినేషన్ ఇవ్వాలని ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి కృష్ణబాబు అన్నారు. ఫ్యామిలీ వెల్ఫేర్ వీర పాండ్యన్, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి మంగళవారం తనపల్లి విలేజ్ క్లినిక్‌ను తనిఖీ చేసారు. ఆస్పత్రికి రోజు వచ్చే రోగుల వివరాలు,వారికి అందిస్తున్న వైద్య సేవలు గురించి ఆరా తీసారు. సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. నాన్ కమ్యూనికేషన్ డిసీజెస్ ఎన్‌సిడి సర్వేప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. సర్వే ద్వారా సేకరించిన డేటా ఆధారంగా బేబీ షుగర్‌కు సంబంధించిన మందులు అందుబాటులో ఉండాలని, వ్యాధి నిర్ధారణ అనంతరం చికిత్స అందించాలన్నారు. బి.పి. షుగర్‌కు సంబంధించిన మందులు ఆసుపత్రి నందు అందుబాటులో ఉంచుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. 104 అంబులెన్స్ వాహన వైద్య సేవలను ఎంతమందిరి అందిస్తున్నారని, రోగులకు అవసరమైన మందులు అందించేలా ఏఎన్ఎంలు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ద పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డిఐజి శాంతకుమారి, డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి, మెడికల్ సూపరింటెండెంట్ ఉదయశ్రీ, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యధర్శి చంద్రశేఖర్‌రెడ్డి, విఆర్వో వలర్‌మతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడు పెళ్ళివేడుకలు

గజవాహనంపై వేంచేసిన మలయప్ప

తిరుమల, మే 6 ప్రభాతవార్తప్రతినిధి:

నారాయణగిరిఉద్యానవనాల్లో ప్రత్యేకంగా నిర్మించిన శ్రీనివాసుని పరిణయమండపంలో పద్మావతిపరిణయోత్సవాలు కన్నులపండువగా మొదలయ్యాయి. మూడురోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు మంగళవారం సాయంత్రం శ్రీదేవిభూదేవిలతో కలసి మలయప్పస్వామి గజవాహనంపై,తిరుచ్చిలపై వేర్వేరుగా ఆలయంనుండి ఉద్యానవనాలకు మంగళవాయిద్యాల నడుమ వేంచేశారు. చిరుజల్లులు పడుతుండగా ఆహ్లాదకరవాతావరణంలో పరిణయోత్సవాలు ఆరంభమయ్యాయి. ఫల, పుష్పాలతో తీర్చిదిద్దిన కల్యాణమండపం వేదికపై స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చి కొలువు,ఎదుర్కోలు, పూలబంతులాట ,నూతన వస్త్రాలతో వేడుకలు తొలిఘట్టంజరిపించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఈఓవెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, విఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం

- కరెంట్ సరఫరా అంతరాయం

- రైల్వే ట్రాక్ పై పడ్డ చెట్టు రైళ్ల రాకపోకలు అంతరాయం

వెంకటగిరి, మే 6, ప్రభాతవార్త

స్టేషన్ వద్ద ట్రాకు అడ్డంగా చెట్టు పడటంతో రైలు రాకపోకలకు అంతరాయం కలిగింది. పద్మావతి ఎక్స్రెస్ రైలును యాతనూరు స్టేషన్ వద్ద నిలిపివేశారు. చెట్టును తొలగించరా అనంతరం పద్మావతి ఎక్స్రెస్ రైలు నడిపారు. ఉరుములో మెరుపులతో కూడిన భారీ వర్షం. కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. పెనుగాలులకు మామిడికాయలు రాలినట్టు రైతులు వాపోతున్నారు. భారీ వర్షాలు పడడంతో వాతావరణం చల్లబడింది.

శ్రీకాళహస్తిలో వాన బీభత్సం

ముత్యాలమ్మగుడిలో వడగండ్ల వాన

విద్యుత్ సరఫరాకు అంతరాయం

బజారువీధిలో రోడ్లపై ప్రవహిస్తున్న నీళ్ళు, తేరువీధిలో బోరున కురుస్తున్న వాన

శ్రీకాళహస్తి,మే 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం చల్లబడింది. నెల రోజులుగా ఎండలతో సతమతమౌతున్న శ్రీకాళహస్తి పట్టణం పరిసరాల ప్రజలకు మంగళవారం రాత్రి ఉరుములు మెరుపులు, వడగండ్ల వానతో బీభత్సం సృష్టించింది.రోడ్లు అన్ని జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది. సుమారు గంట పాటు జనజీవనం స్థంభించింది. మంగళవారం ఉదయం నుంచి ఎండలు దడపుట్టించింది. మధ్యాహ్నం వీధులన్ని నిర్మానుష్యమయ్యాయి. సాయంత్రం హఠాత్తుగా వాతావరణంలో మార్పురావటంతో హమ్మయ్యా! అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

వడగండ్ల వాన:

శ్రీకాళహస్తిలోని ముత్యాలమ్మగుడివీధిలో మంగళవారం సాయంత్రం హఠాత్తుగా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉరుములు మెరుపులు చోటు చేసుకున్నాయి. ఉరుములు మెరుస్తుంటే జనం భయభ్రాంతుల య్యారు. ఈ నేపథ్యంలోనే ముత్యాలమ్మగుడిలో పెద్ద పెద్ద వడగండ్లు పడినట్లు సమాచారం అందింది. ఎక్కడి వాహనాలు అక్కడ స్థంభించాయి. ఇక అంతంత మాత్రంగా ఉన్న మున్సిపల్ కాలువలు వాన నీటిని సరిపెట్టుకోలేక పోయాయి.దాంతో రోడ్లు జలమయమయ్యాయి. ముఖ్యంగా తేరువీదిలో ఎన్నడూ లేని విధంగా రోడ్లు జలమయమయ్యాయి. ఇక నగరి వీధి, పెండ్లిమండపం సర్కిల్‌లో మోకాలు లోతు నీళ్ళు ప్రవహించాయి. ముత్యాలమ్మగుడివీధిలోని టౌన్‌బ్యాంకు వరకు మోకాలు లోతు నీళ్ళు ప్రవహించాయి. అధికారులు ఏం నష్టాలు వాటిల్లినాయో అని చరవాణిల ద్వారా సమాచారాలు సేకరిస్తున్నారు.

గంగమ్మ జాతర ప్రశాంత వాతావరణంలో జరగాలి

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మే 6 ప్రభాతవార్త

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అధికారయంత్రాంగం, ప్రజాప్రతినిధులతో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆలయ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తదితరులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల మాట్లాడారు. ఈనెల 20,21తేదీల్లో జరిగే జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, ఆలయ కమిటీ తగు ఏర్పాట్లతో పాటు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. మహిళాభక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు స్థలం కొనుగోలు చేయడం పట్ల ఆయన ఛైర్మన్‌ను అభినందించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ జాతరసందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. గంగమ్మ తల్లి దర్శనానికి లక్షలాది భక్తులు వస్తారని ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పంలో శ్రీ తిరుపతి గంగమ్మ జాతరకు అధికారులను సమన్వయం చేసి విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జాతర నిర్వహణకు పనిచేయడం తనకు కొత్త అనుభూతి కలిగిస్తోందన్నారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, డిఎస్పీ పార్థసారథి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, రెస్కో ఎండి సోమశేఖర్, తహశీల్దార్ చిట్టిబాబు, రాష్ట్ర నేత గోపీనాథ్, ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, వేలు, నేతలు సత్యేంద్ర శేఖర్, ఆర్ముగం, ప్రతాప్, వాసు, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, సికె మణి, శారదమ్మ, సుగుణమ్మ, తిరుమగళ్, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంకు సమన్వయంతో పనిచేయాలి - కడ పి.డి. వికాస్ మర్మత్

శాంతిపురం, మే 6 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారంకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల కార్యాలయంలో ఆయన స్వర్ణకుప్పం విజన్‌పై ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుప్పం అభివృద్ధిపై తరచూ సమీక్ష జరుపుతున్నారన్నారు. కుప్పానికి త్వరలోనే పరిశ్రమలు రానున్నాయని తద్వారా పన్నెండు వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. త్వరలోనే మరిన్ని గోకులం షెడ్లు మంజూరవుతాయన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటి సమస్య ఎక్కడా రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులురాజు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారా ం, నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, చంద్ర, ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, తహశీల్దార్ శివయ్య, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు సిఎం చంద్రబాబు అన్ని విధాలా అండ - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, మే 6 ప్రభాతవార్త

రాష్ట్రంలోని రైతులకు సిఎం చంద్రబాబునాయుడు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం శాంతిపురంలో వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు రాయితీతో అందించే వ్యవసాయ పరికరాలు, పనిముట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సీజనుకు ముందరే పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం రైతులకు రాయితీతో డ్రిప్ పరికరాలు, ఎరువులు, విత్తనాల పంపిణీకి తగు చర్యలు చేపట్టిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు కూడా ప్రభుత్వ పథకాలు, రాయితీలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. రైతుల్ని అన్ని విధాలా ఆదుకునేది సిఎం చంద్రబాబేనన్నారు. మండలంలో త్వరలోనే కృషి విజ్ఞాన కేంద్రం, మదర్ డెయిరీలు రైతులు అందుబాటులో వస్తాయన్నారు. అనంతరం రైతులకు మడకలు, స్ప్రేయర్లు, రోటోవేటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, చంద్ర, ఉదయ్, నాగరాజ్, ఎల్.జయరాంరెడ్డి, ఈడిగ రమేష్, మణి, నారాయణరెడ్డి, మునిరెడ్డి, యోగేంద్రరెడ్డి, విజయ్, నాగరాజు, అనసూయ, శ్యామల, సుగుణమ్మ, ఎఒ అప్పోజి, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కట్టమంచి చెరువు సుందరీకరణ పనులు వేగవంతం

- ఎమ్మెల్యే గురజాలతో కలిసి పరిశీలించిన జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిత్తూరు రూరల్, మే 6 ప్రభాతవార్త: చిత్తూరు కట్టమంచి చెరువులో జరుగుతున్న పూడిక తీత, సుందరీకరణ పనులను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, ఇరిగేషన్ అధికారులతో కలిసి కట్టమంచి చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కట్టమంచి చెరువు గట్టు పటిష్టం చేయడానికి తీసుకుంటున్న చర్యలను మంత్రి అధికారులతో సమీక్షించారు. వర్షాకాలం ముందుగానే చెరువులో పూడికతీత పనులు పూర్తి చేయడానికి వీలుగా పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల పూడికతీత పనులు జరుగుతున్న తీరును మంత్రికి వివరించారు. అనంతరం ఇన్‌ఛార్జీ మంత్రి గాంధీ రోడ్డును పరిశీలించి రోడ్డును పూర్తి స్థాయిలో మరమ్మత్తు పనులు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, ఇతర నాయకులు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీలు రుణాలకు దరఖాస్తు చేయండి

పుంగనూరు, మే 6, ప్రభాతవార్త

పురపాలక పరిధిలో మైనారిటీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్స్, బుద్ధిస్ ,సిక్కు, జైన్ ,పార్సిలకు ,చెందిన అభ్యర్థులు రేషన్ కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్ తదితర వివరాలతో ఈనెల 25వ తేదీలోగాదరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

9న నుంచి కావమ్మ మారయ్యల ఉత్సవాలు

సదుం, మే 6, ప్రభాతవార్త

సదుం గ్రామపంచాయతీ బట్టువారిపల్లిలో వెలసిన శ్రీ కావమ్మ మారయ్యల ఆలయంలో ఈ నెల 9 నుంచి స్వామి వారి ఉత్సవాలు నిర్వహించబడతాయని కార్య నిర్వాహకులు తెలిపారు. 9న ఆలయంలో స్వామివార్లకు అభిషేకం, ఆరాధన, జంగాల కథ 10న కళ్యాణోత్సవం, సారె పంచుట, జంగాల కథ 11న అగ్నిగుండ ప్రవేశం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గోనాలని కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

సదుం, మే 6, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ గ్రామాలలో జరిగే బాల్యవిహాలను ఎదుర్కొని వాటిని అరికట్టాలని అంగన్వాడి సూపర్వైజర్ మల్లీశ్వరి అన్నారు. మంగళవారం కిశోరి బాలికల వికాసం కార్యక్రమంలో భాగంగా రెడ్డివారిపల్లెలోని సచివాలయం అంగన్వాడి కేంద్రంలో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపర్వైజర్ మాట్లాడుతూ బాల కార్మికుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, అనర్థాలు గురించి కార్యక్రమంలో వివరించారు. కిషోర్ బాలికలకు పోషష్టికాహారం పైన పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హనుమంత్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్త సుజాత, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ సెక్రెటరీ అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు మండలంలో టీడీపీ గ్రామ కమిటీల ఏకగ్రీవం

పుత్తూరు రూరల్, మే 6 ప్రభాతవార్త: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశానుసారం పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసినట్లు పంచాయతీ నాయకులు, పుత్తూరు రూరల్ మండల ఎన్నికల పరిశీలకులు తెలిపారు. గోపాలకృష్ణాపురం అధ్యక్షుడు ఎం.గంగాకుమార్,ప్రధాన కార్యదర్శిగా సి.తేజ, నేసనూరు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పి.రమేష్, ప్రధాన కార్యదర్శి డి.మోహన్‌లను ఏకగ్రీవంగాఎన్నుకున్నట్లు రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ గంజిమాధవయ్య తెలియజేశారు. ఈ సమావేశాల్లో పుత్తూరురూరల్ ప్రధాన కార్యదర్శి బాలాజీ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కరుణ, ఆయా గ్రామాలటీడీపీ నాయకులు పాల్గొన్నారు.

16న సిఎం చంద్రబాబు దంపతులు కుప్పం పర్యటన..?

కుప్పం, మే 6 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 16న ఒకరోజు పర్యటన నిమిత్తం కుప్పం రానున్నట్లు తెలిసింది. ఆరోజు కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం ఒకచేరుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం అమ్మవారిని దర్శించుకుని మరలా తిరుగుప్రయాణమవుతారని సమాచారం. అయితే సిఎం కుప్పం పర్యటన వివరాలు పూర్తి అధికారికంగా తెలియాల్సి ఉంది.

తంబిగానిపల్లిలో చోరీ

కుప్పంరూరల్, మే 6 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి తంబిగానిపల్లిలో సోమవారం రాత్రి తమ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు బాబు అనే వ్యక్తి తెలిపాడు. తమకు గ్రామంలో రెండు ఇళ్లు ఉన్నాయని తాము పెంకుటింట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు మరో ఇంట్లో ప్రవేశించి బీరువా పగలగొట్టి బంగారుచైను, కమ్మలు, ఉంగరాలు, వెండి తదితరాలతో పాటు నాలుగువేల నగదును దొంగిలించారని పేర్కొన్నాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.

కిశోర వికాసంపై ప్రతి బాలికకు అవగాహన

- సిడిపిఓ పద్మసునంద

శ్రీరంగరాజపురం, మే 6 ప్రభాతవార్త:

కిశోర బాలికల్లో కిశోర వికాసం బాలికలకు ఉజ్వల భవిష్యత్తు ఇస్తోందని కార్వేటినగరం సిడిపిఓ పద్మ సునంద పేర్కొన్నారు. సిడిపిఓ పద్మసునంద మంగళవారం మండలంలోని ఆరిమాకులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం, వ్యక్తిత్వ అభివృద్ధి, యవ్వనంలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రుతు చక్రంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఆ సమయంలో ఎదుర్కొనే సమస్యలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ పద్మ సునంద కౌమార బాలికల్లో రుతు స్రావంలో వున్న సమస్యలను తొలగించడానికి బాలికలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రుతు చక్రం గురించి వివరిస్తూ బాలికల ఆరోగ్యానికి, భవిష్యత్తులో పెద్దయ్యాక పిల్లలను కనడానికి ఎంత ముఖ్యమో వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాలిని, ఇందిరమ్మలు, మహిళా పోలీస్ శోభారాణి, ఎఎన్ఎం యమునా, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతోనే నేరాలకు అడ్డుకళ్కెం

- ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, మే 6 ప్రభాతవార్త:

ఆధునిక నేరాలను ఆధునిక పద్ధతుల్లోనే ఎదుర్కొని అడ్డుకట్ట వేయాలని ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్‌పై స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఒకరోజు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తే నేరస్తులను శాస్త్రీయంగా, చట్టపరంగా ఎదుర్కొనగలుగుతామన్నారు. అందుకే ఆధారాల సేకరణ శాస్త్రీయంగా జరుగాలని, ప్రతి అధికారి దీనిని ఒక బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఒక నేర స్థలంను శాస్త్రీయంగా గుర్తించడం, చట్టపరంగా ధృవీకరించడం ఆధారాల సమీకరణ అత్యంత కీలకమన్నారు. సంఘటనా స్థలంలోని ప్రతి ఆధారం అంటే ముద్రలు, రక్తపు మరకలు, జుట్టు, ఆధునికంగా డిజిటల్ ఆధారాలైన మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు మొదలైనవి క్రమపద్ధతిలో సేకరించాల్సిన అవసరం వుంటుందన్నారు. అలాగే విచారణ అధికారులు తప్పనిసరిగా కొన్ని నియమాలను పాటించాలని, ఎలాంటి తప్పులు చేయకూడదని స్పష్టం చేశారు. సాక్ష్యాలను గ్లోవ్స్ వేసుకుని మాత్రమే తాకాలని, ప్రతి ఆధారంకు ప్రత్యేకంగా లేబుల్ పెట్టి, వాటిని ఫోటోలు, వీడియోల ద్వారా పూర్తి స్థాయిలో డాక్యుమెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు, సైంటిఫిక్ అసిస్టెంట్లు బాలరామకృష్ణ, శ్రీరాములురెడ్డి, ఉమామహేశ్వరీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

గుడిపాల, మే 6 ప్రభాతవార్త:

రైతుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడమే స్కిల్ ఆఫ్ చిత్తూరు కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయ అధికారి మాధవి అన్నారు. మండల పరిధిలోని 189 కొత్తపల్లి మరకాల కుప్పం రైతు సేవా కేంద్రం ఆవరణలో మంగళవారం రైతులకు డిజిటల్ ట్రైనింగ్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు స్మార్ట్ ఫోన్ల ద్వారా సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానం, వ్యవసాయ శాఖ అప్లికేషన్లు, డిజిటల్ పేమెంట్లు, యూట్యూబ్ ఛానల్స్ నిర్వహణ, వాతావరణ స్థితిగతులు తెలుసుకోవడం, మార్కెట్ ధరల గురించి ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తెలుసుకోవడం తదితర అంశాలపై రైతులకు వివరించారు. రైతులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంను లాభసాటిగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ సుధాకర్ యాదవ్, మాస్టర్ ట్రైనర్ నదీమ్, వివిఎ తలుసీరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాప్‌లపై రైతులు అవగాహన

- ఏవో విజయ శేఖర్

కల్లూరు, మే 6, ప్రభాతవార్త

వ్యవసాయ యాప్‌లపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని ఏవో విజయ శేఖర్ అన్నారు. పులిచెర్ల మండలం మంగళంపేట రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ యాప్‌లపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్గనైజర్ అఖిల మాట్లాడుతూ రైతులందరూ తమ స్మార్ట్ ఫోన్ ద్వారా వ్యవసాయ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని తద్వారా పంటలు సాగు సస్యరక్షణ చర్యలు పై అవగాహన కలుగుతుందని, దీంతో పంటలుసాగులో అధిక దిగుబడులు సాధించేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర నాయకులు విజయ, వాటర్ షెడ్ వైర్మన్ ప్రభాకర్, రైతులు, ఇనయతుల్లా, జయ స్వామి, అహ్మద్ భాషా, ముని రాజా తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

ఆశాలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వుండాలి

చౌడేపల్లి, మే 6 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా వుండాలని వైద్యా ధికారి పవన్‌కుమార్ సూచించారు. స్థానిక ఆరోగ్యకేంద్రం ఆశా కార్యకర్తల దినోత్స వాన్ని నిర్వహించారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు జన్మనిచ్చేంత వరకు కంటికి రెప్పలా కాపాడాలన్నారు. అనంతరం తల్లీబిడ్డలకు సంక్షేమాన్ని, టీకాలు వంటివి వేయించాలన్నారు. మధుమేహం, బిపిలున్న వారిపట్ల జాగ్రత్తగా వుండాలనీ, వారిని ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. ఆశా ఆప్‌లోని 5రకాల ప్రయోజనాలను ప్రతి చేయాలన్నారు. మండలంలోని 36మంది ఆశాలకు సమదుస్తులు పంపిణీ చేసారు. ఆరోగ్య సిబ్బంది పార్వతమ్మ, హరినాథ్, బాహుద్దీన్, రెడ్డెమ్మ, జమున, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా పోలీసు కుటుంబానికి ఆర్థికసాయం

చౌడేపల్లి, మే 6 ప్రభాతవార్త

చౌడేపల్లి పరిధిలోని గోసలకురపల్లికి చెందిన మహిళా పోలీసు లక్ష్మీ మృతి చెందిన విషయం విధితమే. మృతురాలి కుటుంబానికి జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆర్థిక సాయమం దించారు. కుప్పం నియోజకవర్గం గుడిపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న మృతురాలు లక్ష్మీ భర్త హరీష్‌బాబుకు ఎస్పీ చందోలు ఐడిఆర్ఎఫ్ నిధుల నుంచి రూ. లక్ష చెక్కునందించాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకొంటామన్నారు.

గంగమ్మ సేవలో విద్యాసంస్థల అధినేతలు

బోయకొండ(చౌడేపల్లి), మే 6 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను విద్యా సంస్థల అధినేతలు, రాజకీయ ప్రముఖులు దర్శించుకొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనభాగ్యం అనంతరం పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. తిరుపతి రాయలసీమ ఆనందరెడ్డి, విజయారెడ్డి, మిద్దింటి కిషోర్ తదితరులు గంగమ్మను దర్శించుకొన్నవారిలో వున్నారు.

నలుగురు జూదరులపై కేసు నమోదు

చౌడేపల్లి, మే 6 ప్రభాతవార్త

పేకాటాడుతున్న 4గురు జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలి పారు. ఆయన కథనం మేరకు... మండలం లోని దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లి సమీపంలోని పూలకుంట చెరువులో జూద మాడుతున్నట్లు సమాచారమొచ్చింది. వెంట నే సిబ్బందితో వెళ్ళి జూదస్థావరంపై దాడి చేసారు. ఈ దాడిలో వీరపల్లి రవి, రాజులూరు మధు, నాగరాజు, ఫరీద్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 5100లు, 52పేకముక్కలను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు మంత్రిచే బ్యాటరీ సైకిళ్ళు అందజేత

చిత్తూరు, మే 6 ప్రభాతవార్త:

చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధి లోని 18 మంది విభిన్న ప్రతిభావంతులకు ఎంపి ల్యాడ్స్ నిధుల నుండి రూ.6.30 లక్షల విలువైన బ్యాటరీ ఆపరేటెడ్ సైకిళ్ళను మంగళవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, వివిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా శాఖ మంత్రికి ఘన స్వాగతం పలికిన టిడిపి నాయకులు

కల్లూరు, మే 6, ప్రభాతవార్త పులిచెర్ల మండలం కల్లూరులో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి. టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి చిత్తూరులో జరుగు డి డి ఆర్ సి సమావేశానికి బయలుదేరారు మార్గమధ్యం కల్లూరులో మంత్రి మండలంలో అభివృద్ధి పనులు, పార్టీ సంస్థాగత ఎన్నికల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, బండ్ల రమేష్. లెక్కల ధనుంజయ నాయుడు, మురళి నాయుడు, కేశవ, అనిల్, కరుణాకర్ నాయుడు, ఖాదరవల్లి, మహేష్, సురేష్, ముద్దు స్వామి నాయుడు, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ హెచ్‌పీ వ్యాఖ్యలపై నల్ల బాడ్జిలతో నిరసన

పెళ్లకూరు, మే 6, (ప్రభాతవార్త):

సచివాలయ ఎంఎల్ హెచ్ పీలు పీహెచ్ సీ లలో పనిచేసే ఏఎన్ ఎం, సూపర్ వైజర్ తదితర ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యాలకు నల్ల బాడ్జెలతో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకట శివారెడ్డి, భూలక్ష్మి, ఇందిర తదితరులు ఉన్నారు.

యువతకు ఉపాధి లక్ష్యమే ముఖ్యమంత్రి లక్ష్యం

శ్రీకాళహస్తిరూరల్, మే 6 ప్రభాతవార్త

యువతకు ఉపాధి లక్ష్యంగానే ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించి అమలుకు ఆదేశించారని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాచగున్నేరి వద్ద నూతన పారిశ్రామిక వాడలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎంఎస్ఎంఇ ఎంటర్‌ప్యూనర్ కార్యక్రమాలకు శాసనసభ్యుడు బొజ్జల వవెంకటసుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ముందుచూపులతో రాబోవు 20 సంవత్సరాల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని యువతకు ఉపాది అవకాశాలను అందించుటకు లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకున్నారని ఎంఎల్‌ఏ వివరించారు. ఈ నేపధ్యంలో పరిశ్రమల స్థానకు తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి నియోజకవర్గం కేంద్రంగా ఉందన్నారు. విశాఖ-చెన్నై కారిడార్‌లో

శ్రీకాళహస్తి కీలకంగా ఉందన్నారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు మండలంలో భారీ ఎత్తున పరిశ్రమలు స్థాపించబడుతున్నాయన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చదువుకున్న వారికి అర్హతలున్న వారికి రాబోవు ఐదేళ్ళులో అందరికి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి మండలంలోని

రాచగున్నేరి వద్ద ఎంఎస్ఎంఇకు శంకుస్థాపన

రాచగున్నేరి వద్ద 1994 నుంచి భారీ పరిశ్రమలు రావటానికి తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. నేడు ఇక్కడ ఉన్న శ్రీకాళహస్తిపైప్స్, వెంకటేశ్వర ఐరన్ పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారు. ఈ నాటి ఈ శంకుస్థాపన తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో పరిశ్రమలశాఖ అధికారులతో పాటు ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి తెలఉుగుదేశం నాయకులు చెంచయ్యనాయుడు, విజయకుమార్‌నాయుడు, బొల్లినేని జగన్నాధం నాయుడు, పాపిరెడ్డి, బత్తిరెడ్డి శ్రీకాళహస్తి మండలంలోని పలువురు నాయకులు హాజరయ్యారు.

గ్రామాల్లో వైభవంగా ప్రారంభమైన గంగజాతర

నారాయణవనం, మే 6 ప్రభాతవార్త :

మండలంలోని భీమునిచెరువు, కశింమిట్ట, జిఎన్.కండ్రిగ, తిరువట్యం, వెత్తలతడుకు, నాగిలేరు, కీళగరం గ్రామాల్లో మంగళవారం నుంచి గంగజాతర వేడుకలు ఘనంగా ప్రారంభమైనది. గంగమ్మ ఆలయాల ఎదుట చలువపందేళ్లు, విద్యుత్‌ధీ పాలం కరణ, తోరణాలు, పచ్చనివేపాకు తోరణాలను కట్టారు. మహిళా భక్తులు ఉదయం అంబల్లు పోశారు. రాత్రి అమ్మవారిని ట్రాక్టర్‌పై అదిరోహించి గ్రామ వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఘనంగా ఊరేగించారు. మొకు (బడి కలిగిన భక్తులు జంతు బలి సమర్పించుకున్నారు. ఊరేగింపు సమయంలో కరకాట్టం డ్యాన్స్ యువతను మొప్పించింది. భక్తులు టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు.

నలుగురు మందుబాబులు అరెస్టు

శ్రీకాళహస్తి, మే 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోని జికె.రెడ్డి కాలనీ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని అర్బన్ సిఐ డి.గోపి తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఖాళీ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తున్నట్లు తెలిస్తే సహించేది లేదని ఓపెన్‌బూజింగ్‌ను అరికడుతామన్నారు. పుణ్యక్షేత్రంలో ఇలాంటివి నిషేదం అన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కేవీపురంలో కిషోర వికాసంపై వేసవి శిక్షణ కార్యక్రమం

విజయపురం, మే 6 ప్రభాతవార్త: మండలంలోని కేవీ పురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీడీపీవో కృష్ణవేణి ఆధ్వరనయంలో కిషోర వికాసం వేసవి శిక్షన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర బాలబాలికలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, జీఎం ఎస్‌కేలు ఈశ్వరి, ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు కల్పన, సంధ్య, దీప, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వండి - ఎంపీడీవో

విజయపురం, మే 6 ప్రభాతవార్త: మండలపరిధిలో అన్ని గ్రామాల్లో మంచినీటిసమస్య పరిష్కారానికి తగిన ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని ఎంపీడీవో రాజేంద్ర పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా కోసలనగరం గ్రామంలో మంచినీటి సమస్య ఉందని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని సూచించారు. అనధికారిక కనెక్షన్లు కలిగి ఉండడంతోనే తాగునీటి సమస్యవస్తుందని తెలుస్తోందన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలం కబ్జా చేసి అసత్య ఆరోపణలు చేస్తున్నారు: గుణశేఖర్‌రెడ్డి

విజయపురం, మే 6 ప్రభాతవార్త: నగరి మున్సిపాలిటీ జ్యోతినగర్‌లో

ఇంటి స్థలాన్ని మాజీ మంత్రి రోజా భర్త, వాళ్ళ సోదరుడు అండదండలతో ఆక్రమించుకుని ఆసభ్య ఆరోపణలు చేస్తున్నారని టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన స్వగ్రామం కళియంబాకంలో మీడియాతో మాట్లాడుతూ ఇంటిస్థలం ఆక్రమణకు గురైనప్పుడు ప్రస్తుత నగరి మున్సిపాలిటీ ఛైర్మన్ రూ.40 లక్షలు ఇవ్వాలని బేరం మాట్లాడారని, ఇప్పుడు పత్రికల్లో తప్పుడు ప్రకటన చేస్తున్నారని, కాణిపాకంలో సత్య ప్రమాణానికి రావాలని కోరారు. మీనాకుమార్ అను వ్యక్తి ప్లాట్లు హైవేలో పోయిందని, దానికి ప్రభుత్వం పరిహారం కూడా కట్టించిందని గుర్తుచేశారు. ఈ విషయమై పలుమార్లు నగరి తహసీల్దార్, ఆర్డీవోకి వినతిపత్రం అందించానని, పలుమార్లు సర్వే కూడా చేశారని, కానీ వైసీపీ అధికారం అడ్డు పెట్టుకుని రెవెన్యూ పోలీసులు నన్ను ఇబ్బంది పెట్టారని వాపోయారు. అధికారులున్యాయంగా సర్వే నిర్వహించాలని, అధికారుల మాటలకు కట్టుబడి ఉంటానన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానం

వడమాలపేట, మే 6 ప్రభాతవార్త:

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వడమాలపేట ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండలానికి ఒక కోటి 6 లక్షల రూపాయలు విలువతో 26 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వీటిని మండల పరిధిలోని మూడు బ్యాంకులకు కేటాయించడం జరిగిందన్నారు. 40 శాతం సబ్సిడీ ఉంటుందని, ఐదు శాతం లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుందన్నారు. కనీస విద్యార్హత ఎస్, ఎస్సీ ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 10 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని మూడు సెట్లు కాపీలు ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని శేషగిరిరావు తెలిపారు.

మార్కెట్ యార్డ్ నిర్మాణానికి సహకరించండి

– జిల్లా ఇన్చార్జి మంత్రికి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస నాయుడు వినతి

సోమల, మే 6, ప్రభాతవార్త

నూతనంగా నిర్మించిన మార్కెట్ యార్డులో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని సోమల మార్కెట్ కమిటీ చైర్మన్ కరణం శ్రీనివాస్ నాయుడు జిల్లా ఇన్చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విన్నవించాడు. మంగళవారం చిత్తూరు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో ఆయనను కలిసి సన్మానించాడు. పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్ర రెడ్డిని సైతం ఆయన సన్మానించారు. చైర్మన్‌గా తన ప్రమాణ స్వీకారానికి రావలసిందిగా ఆయనను ఆహ్వానించాడు. మార్కెట్ యార్డ్ నందు ఓవర్ హెడ్ ట్యాంకు 10 లక్షల రూపాయలు, టాయిలెట్ సౌకర్యానికి మరో 10 లక్షలు మంజూరు చేయాలంటూ ఆయన విన్నవించడంతో మంత్రి సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్ నాయుడు తెలిపారు. మే నెలలోనే టమోటా మార్కెట్ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఇరికిపెంట సాగునీటి సంఘ అధ్యక్షుడు బోస్, పొదలకంట పల్లి పంచాయతీ టీడీపీ సీనియర్ నాయకుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ యాంత్రికరణ పనిముట్లు పంపిణీ

– పాడి రైతులకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు
– రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

యర్రావారిపాలెం, మే 6, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతులకు సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల పంపిణీ కార్యక్రమాన్ని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని అట్టహాసంగా ప్రారంభించారు. మంగళవారం యర్రావారిపాలెం మండలంలో సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల ను రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను ఇచ్చి ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నదని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఐదు సంవత్సరాలు వ్యవసాయ శాఖను, రైతులను గాలికి వదిలేసారని అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం రైతులందరికీ వ్యవసాయ పనిముట్లను, పశువుల దాణా అందజేస్తుందన్నారు. రైతుల కష్టాలను సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు దృష్టికి తీసుకెళ్లి యర్రావారిపాలెం మండలంలో సుమారు రూ.4.36 లక్షలతో 50 మంది రైతులకు 50 రకాల వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల ను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సబ్సిడీ ద్వారా రైతులకు అందచేయడం జరిగిందన్నారు. అలాగే మండలానికి 430 గోకులం షెడ్‌లను మంజూరు చేయడం జరిగిందన్నారు. పాడి రైతులకు 370 పశువుల దాణా బ్యాగ్ లను 50 కేజీల బస్తా మార్కెట్ ధర రూ. 1100 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ. 555 అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ, ఎమ్మార్వో పరమేశ్వర స్వామి, మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, పార్లమెంటు కార్యదర్శి మధు, యూత్ ప్రెసిడెంట్ నిరంజన్, చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లూరి దేవి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలు శివ రాణి, మండల ఎస్టి సెల్ అధ్యక్షుడు కుంభ నాగరాజ, రైతు కార్యదర్శి ప్రసాద్ నాయుడు, సోషల్ మీడియా కోడినేటర్ చిన్నప రెడ్డి, కేశవులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఆలయ అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ చేయదు... బిజెపి చేస్తే సహించదు..

వెంకట్రాద్రి యాదవ్.

రేణిగుంట, మే 6 ప్రభాతవార్త కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు బీసీ కుల గణన చేయలేదని బిజెపి చేస్తుంటే సహించలేకపోతున్నదని బిజెపి యువనేత, ఓబిసి యువజన రాష్ట్ర అధ్యక్షులు వెంకటాద్రి యాదవ్ అన్నారు. బిసి కుల గణన వల్ల దేశవ్యాప్తంగా బీసీల అభివృద్ధి జరుగుతుందని యాదవ్ అభిప్రాయపడ్డారు. బీసీల అభివృద్ధి భారత ప్రధాని నరేంద్ర మోడీకే సాధ్యమని అన్నారు. బిజెపి పార్టీ చేస్తున్న అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతున్నదని అన్నారు. ఎప్పటినుండో కాంగ్రెస్ పార్టీ బీసీలను చిన్నచూపు చూస్తున్నదని విమర్శించారు. బీసీలకు ఆగ్రహం వస్తే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో నామరూపాలు లేకుండా పోతుందని హెచ్చరించారు. అనంతరం మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

షోర్ బాలికలకు ఆరోగ్యంపై అవగాహన.

రేణిగుంట మే 6 ప్రభాతవార్త రేణిగుంట మండలం రేణిగుంట పంచాయతీ ఏఎన్ఆర్ కాలనీలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోర వికాసం పై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ అనంత లక్ష్మి మాట్లాడుతూ యుక్త వయసుకు వచ్చిన బాలికలు ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, మానసిక ఒత్తిడి తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. పరిచయం లేని వ్యక్తులతో ఫోన్ ద్వారా సంభాషించడం, చాటింగ్ చేయడం ప్రమాదకరమని తెలిపారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లీశ్వరి, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ మండల కోఆర్డినేటర్ విజయలక్ష్మి, అంగన్వాడి టీచర్ రాధమ్మ, కిషోర బాలికలు పాల్గొన్నారు.

రాస్ ద్వారా కుట్టు మిషన్లు పంపిణీ..

రేణిగుంట మే 6 ప్రభాతవార్త



రాష్ట్రీయ సేవా సమితి (రాస్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దివంగత పద్మశ్రీ డాక్టర్ గుత్తా మునిరత్నం నాల్గవ వర్ధంతి సందర్భంగా మంగళవారం రేణిగుంట మండలం, ఇతర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాస్ సంస్థ దేశవ్యాప్తంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నదని కొనియాడారు. ముఖ్యంగా మహిళల సాధికారత కోసం రాస్ చేస్తున్న సేవలు అమోఘం అన్నారు. ఎంతోమంది అభాగ్యులకు అండగా రాస్ సంస్థ ప్రథమ స్థానంలో ఉందని పొగడ్తలతో సంస్థను ముంచెత్తారు. కార్యక్రమంలో రాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, స్టాఫ్ నర్సులు, సిబ్బంది తదితరులతో పాటు ట్రస్టీలు సుబ్బరత్నమ్మ, నిత్య సుధ, మస్తానమ్మ, శ్యామల, క్లస్టర్ లీడర్లు రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం... కోట వినుత..

రేణిగుంట మే 6 ప్రభాతవార్త

ఏనుగుల వల్ల పంట నష్టం జరిగిన మామండూరు పరిసర ప్రాంతాల రైతులను జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జ్ కోట వినుత మంగళవారం పరామర్శించారు. ఏనుగులు ధ్వంసం చేసిన చెరుకు, మామిడి తోటలను, వరి పొలాలను ఆమె జనసేన నేతలతో కలిసి సందర్శించారు. రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రైతులకు జరిగిన నష్టాన్ని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోట చంద్రబాబు, పలువురు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేణిగుంట చెందిన యువకునికి బిఎస్ఎన్ఎల్ అవార్డు...

రేణిగుంట మే 6 ప్రభాతవార్త రేణిగుంటకు చెందిన సిఆర్ఎస్ విశ్రాంత ఉద్యోగి, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ కుమార్ అల్లుడు బిఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ ఆర్.గుణశేఖర్ కు బిఎస్ఎన్ఎల్ సంస్థ బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు నిచ్చి ఘనంగా సత్కరించింది. విజయ్ కుమార్ అల్లుడు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు చేజిక్కించుకున్నందుకు రైల్వే విశ్రాంత ఉద్యోగులు అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు మరెన్నో తీసుకొని పదోన్నతులు పొంది ఉన్నతమైన పదవిలో ఉండాలని అంతా ఆకాంక్షించారు. గుణశేఖర్ అభినందించిన ప్రతి ఒక్కరికి విజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

ఎపి ఎస్పీడిసిఎల్‌గా డైరెక్టర్లుగా ఆయూబ్‌ఖాన్, గురవయ్య

తిరుపతిరూరల్, మే 6 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పీడిసిఎల్) డైరెక్టర్లుగా పి.ఆయుబ్‌ఖాన్, కె.గురవయ్యలను నియమిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎపిఎస్పీడిసిఎల్‌లో చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవీవిరమణ పొందిన పి.ఆయుబ్‌ఖాన్‌ను, కె.గురవయ్యలను డైరెక్టర్స్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుపతిరూరల్లో గాలీవాన భీభత్సం

-భారీ వృక్షం పడి కారు ధ్వంసం

తిరుపతిరూరల్, మే 6 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలంలో మంగళవారం గాలీ వాన భీభత్సంతో అనేక ప్రాంతాలలో వృక్షాలు నెలకు ఒరిగాయి. సి.గొల్లపల్లిలో భారీ వృక్షం నెలకు ఒరగడంతో గ్రామ పంచాయతీ సర్పంచ్ విడుదల రవికుమార్‌రెడ్డి చెందిన కారు ధ్వంసమైంది. ఆకాల వర్షాలు, గాలులు వీయడంతో తిరుపతిరూరల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పండి.

ఏనుగుల వలన భారీగా పంట నష్టం..

పాకాల, మే 6, ప్రభాతవార్త పాకాల మండలం, పదిపుట్లబైలు పంచాయతీలోని గుండ్ల గుట్టపల్లి గ్రామంలో ఏనుగులు 1.5 ఎకరా టమాటో పంటను తొక్కి సోమవారం రాత్రి నష్టపరచాయి, చంద్రగిరి మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ తోటను క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. పదిపుట్ల బైలు మరియు దామాల చెరువు లోని కొన్ని గ్రామాలలో గాలి వీచడం వలన మామిడిలో కాయలు రాలి స్వల్ప పంట నష్టం జరిగిందని మండల ఉద్యాన అధికారిణి తెలిపారు, రైతులు కాయ కోతకు వచ్చే 10 రోజుల ముందుగా నీటి తడులు ఇవ్వడం ఆపివేయాలని, లేని ఎడల కాయ నాణ్యత దెబ్బతిని, అంత్రక్నోస్ తెగులు ఎక్కువ అవ్వడం, పండు ఈగ ఉదృతి పెరగడం జరుగుతుందని తెలిపారు. కాయ పక్వ దశకు వచ్చే దశలో ఎకరాకు 6 నుండి 8 పండు ఈగ బుట్టలను ఐదు అడుగుల ఎత్తులో కట్టుకోవడం వలన ఈగ ఉదృతిని అరికట్టవచ్చని తెలిపారు. ఈ పండు ఈగ బుట్టలు మార్కెట్ లో అందుబాటులో ఉన్నాయని, వివరాలకు గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు వనజ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

నకిలీ డాక్యుమెంట్స్ కేసులో ముద్దాయికి జైలు

తిరుపతి, మే 6ప్రభాతవార్త: టిటిడి నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించిన కేసులో ముద్దాయికి జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. తిరుమల 1టౌన్ పోలీసు స్టేషన్‌లో శివరామయ్య కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన ఇతను పై 2008లో క్రిమినల్ కేసు నమోదైంది. దీనిపై ముద్దాయి కోర్టుకు కూడా హాజరుకాలేదు. ఈ కేసులో ముద్దాయికి ఏడాది జైలు, వెయ్యిరూపాయలు జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జరిమాన చెల్లించకపోతే ఏడాదిన్నర జైలు శిక్ష తీర్పునిచ్చారు.

ఉన్నత లక్ష్యం వైపు అడుగులు పడాలి.

తిరుపతి విద్య మే 6 ప్రభాత వార్త విద్యార్థులు శ్రమే ఆయుధంగా ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేస్తే ఆశించిన ఫలితాన్ని పొందవచ్చునని ప్రిన్సిపల్ డాక్టర్ జె ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బైరాగ పట్టెడలోని రిమ్స్ కళాశాలలో మంగళవారం ఎమ్మెస్సీ, ఎంసీఏ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన అధునాతన అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు యవత అధునిక టెక్నాలజీతో పాటు స్కిల్ డెవలప్మెంట్ పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వై కొండారెడ్డి, ఆనంద్ రెడ్డి, విజయ్ రెడ్డి, విభాగాధిపతులు నిరంజన్ రెడ్డి, పి మధుర, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు సబ్సిడితో ఫీడ్ పంపిణీ

నారాయణవనం, మే 6 ప్రభాతవార్త :

పాడి రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఉచితంగా 50శాతం సబ్సీడితో ఫీడ్‌ను అందించారు. మండలంలోని భీమునిచెరువు రైతు సేవా కేంద్రంలో పాడి రైతులకు ఒక్కొక్కరికి ఒక బస్తాను అందించారు. ప్రభుత్వం ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలకు అందించిన తర్వాత మిగిలిన కులాల రైతులకు అందించడం జరుగుతుందన్నారు. సబ్సీడి క్రింద ఒక బస్తా 550 రూపాయాలతో రైతులకు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి ఆరుముగం, మాజీ సర్పంచ్ కె సుధాబాబు, పశు వైద్యాధికారులు డాక్టర్ భార్గవి, డాక్టర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సుజన, ఇఎ అజిత్, స్థానికులు గోవిందరాజులు, విజయకుమార్, కుట్టి బాలయ్య, మురుగేశరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలనే లక్ష్యం: గోపాలన్న ఆశయాలే సూర్తిదాయకం!

శ్రీకాళహస్తి, మే 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నాటి గోపాలకృష్ణారెడ్డి పాలనను అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నానని ఆయన కన్నా మంచి పాలన అందించారనే మంచి పేరు సంపాదించి గోపాలకృష్ణారెడ్డి ఆశయాలను స్పూర్తిదాయకంగా ప్రజలకు అందించటమే లక్ష్యంగా ఏడాదిగా పరిపాలిస్తున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పది నెలల పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సామాజికాభివృద్ధియే లక్ష్యంగా చర్యలు తతీసుకుంటున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో వైస్‌రాయ్‌సంఘటన, తిరుమల వద్ద బాంబ్‌బ్లాస్టింగ్‌లో నేటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుతో గోపాలకృష్ణారెడ్డి స్నేహం సన్నిహితం మరువరానిదన్నారు. శ్రీకాళహస్తి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించిన గోపాలకృష్ణారెడ్డి లేక పోవటం తీరని లోటు అన్నారు. నేడు తాను ఎంఎల్ఏగా ఉన్నానంటే నాడు గోపాలకృష్ణారెడ్డి అందించిన సేవలే అన్నారు. శ్రీకాళహస్తి ప్రజలకు నీతివంతమైన పరిపాలన అందించుటకు ప్రయత్నిస్తున్నాని సుధీర్‌రెడ్డి వివరించారు. రాబోవు రోజుల్లో పరిపాలనలో సమూల మార్పులు ఉంటాయని సుధీర్‌రెడ్డి వివరించారు. తన 11 నెలల పాలనలో ఎన్నో కీలక మార్పులు చేర్పులు చేపట్టామన్నారు. ముఖ్యంగా స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల పునఃప్రారంభం కు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో మాస్టర్‌ప్లాన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. స్కిట్ పునః ప్రారంభానికి రూ.5లక్షలతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టామన్నారు. గోపాలకృష్ణారెడ్డి ఆశయాలు, లక్ష్యసాధనకు ఆయన తనయుడుగా కృషి చేస్తామని సుధీర్‌రెడ్డి అన్నారు.

శ్రీకాళహస్తి ముస్లింల సమస్యలపై స్పందించండి:

శ్రీకాళహస్తి, మే 6 ప్రభాతవార్త శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మైనారిటి ముస్లింలు ఆర్థికసమస్యలను ఎదుర్కొంటున్నారని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే పథకాల్లో అవకాశం కల్పించి ఆదుకోవాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ వైకాపా మైనారిటి అధ్యక్షుడు పఠాన్ ఫరీద్‌ఖాన్ తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తిని కలసి అభ్యర్థించారు. మంగళవారం ఆయన తన సహచరులతో కలసి ఎంపిని సత్కరించారు. నేడు మైనారిటి ముస్లింలు ఆర్థికంగా ఎంతో వెనుక బడి ఉన్నారు. 2004లో డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి మైనారిటి ముస్లింలకు ఇచ్చిన 4శాతం ఉపాధి విద్యా అవకాశాలు తప్ప ప్రభుత్వాల నుంచి ఎలాంటి సదుపాయాల్లేదని ఎంపికి వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల్లో మైనారిటిలకు ప్రత్యేక అవకాశం కల్పించాలని కోరారు. ఆయనతో పాటు మైనారిటి నాయకులు షేక్ అస్లం, షేక్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం గంగమ్మ జాతరకు సన్నాహాలు

శ్రీకాళహస్తి, మే 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని బిపి అగ్రహారం గంగమ్మ జాతరకు సిద్దమౌతుంది. గంగమ్మజాతరకు భక్తి శ్రద్దలతో పూజలు జరిపి చాటింపు జరిపారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరతో పాటు శ్రీకాళహస్తిలోని పానగల్‌లో భాగం అయిన అగ్రమారంలో జాతర నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో యువకులు జాతరకు సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం అగ్రహారం నడిబొడ్డులోని గంగమ్మ ఆలయంలో వెలసిన మూల విరాట్టుకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సంబరాలకు మహిళలు భారీ ఎత్తు హజరై అంబళ్ళు నిర్వహించారు. ఈ నెల 13,14 తేదుల్లో నిర్వహించే జాతరకు విస్తృతస్థాయిలో కమిటి సభ్యులు చేపట్టారు. ఈ నెల 13వ తేది పొన్నాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్ళు నిర్వహిస్తామని కమిటి ప్రకటించింది. పానగల్‌లో వెలసిన పొన్నాలమ్మ ఆలయం వద్ద అగ్రహారం జాతర సందర్భంగా చుట్టుపక్కల ఏడు గ్రామాలకు చెందిన వారు పొంగళ్ల నిర్వహించటం ఆనవాయితిగా వస్తుందని ఈ ఏడాది అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటి ప్రకటించింది. 13వ తేది పొన్నాలమ్మ ఆలయం వద్ద పొంగళ్ళు, రాత్రి అమ్మవారి కొలువు 14వతేది గంగమ్మ స్థావరం వద్ద ప్రతిష్ట సర్వదర్శనం మొక్కులు చెల్లించుకొను భక్తులకు దర్శనాల రాత్రి నిమజ్జనం ఉంటుందని వివరించారు. ఈ ఏడాది గంగమ్మకు స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సారె అందిస్తారని కమిటి నిర్వాహకులు సుబ్రమణ్యం రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాల్లో కృష్ణారెడ్డి, కందపు శెట్టి, వెంకటమునిరెడ్డి, వవెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడల్లో గోపాలకృష్ణారెడ్డి వర్ధంతి

శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్/తొట్టంబేడు, మే 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభి. వృద్ధి పథకం నడిపి విలువలతో కూడిన రాజకీయం అందించిన అభివృద్ధికి అంత్యంత ప్రాధాన్యత ఇచ్చిన స్వర్గీయ గోపాలకృష్ణారెడ్డి మూడవ వర్ధంతిని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దేశం వర్గాలు నిర్వహించారు. రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలం, అర్బన్, తొట్టంబేడు మండలాల్లో దేశం కార్యకర్తలు స్వచ్చంగా నిర్వహించారు. ఈ నేపధ్యం లో శ్రీకాళహస్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు సారధ్యంలో గోపాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. శ్రీకాళహస్తిలో సుమారు 5 ఎకరాలలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన ఘనత గోపాలకృష్ణారెడ్డిది. ఈ కార్యాలయానికి ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్ అని నామకరణం చేసారు. ప్రతిపక్ష నాయకుడుగా ప్రస్తుత ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో వచ్చినపుడు ఇక్కడే రాత్రి బస చేసారు. ఈ కార్యక్రమాల్లో విజయకుమార్‌తోపాటుకంతారమేష్, వెంకటేశ్వర చౌదరి షాకిర్ అలి పలువురు కార్యకర్తలు హాజరయ్యారు. **సమాధి వద్ద పూజలు** శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలోని సుధీర్‌రెడ్డి స్వగృహం వద్ద మంగళవారం ఉదయం గోపాలకృష్ణారెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అలాగే ఆయన సమాధి వద్ద కుటుంబసభ్యులు అశ్రునివాళి సమర్పించారు. అక్కడ శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి, ఆయన మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, ఎంఎల్‌ఏ సతీమని బొజ్జల రిషితారెడ్డి, డాక్టర్ కె.గెరటారెడ్డి, వారి కుటుంబసభ్యులతో పాటు ఆ కుటుంబంతో అత్యంత సన్నిహితంగా మెలిగిన రాంబాబు, రంగినేని చెంచయ్యనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి, పొన్నారావు, పట్టణానికి చెందిన నాయకులు, ఏర్పేడు మండలం నాయకులు, తొట్టంబేడు మండలం నాయకులు హాజరయ్యారు.

గూడూరు డివిజన్

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ప్రోత్సాహం

- పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు బహుమతి

గూడూరు, మే 6 ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో మార్కులు సాధించి అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ప్రోత్సహించేందుకు బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ముందుకు రావడం ఎంతో అభినందనీయమని తిరుపతి జిల్లా టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని చెన్నూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా నలగర్ల రమ్యశ్రీ 572, గూడూరు భవ్యశ్రీ 570, ఆదోని చంద్రహాసిని 566 మార్కులు సాధించారు. వీరికి బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోణక మల్లికార్జున్ రెడ్డి (స్నాప్) దాతృత్వంతో నగదు బహుమతులను ముఖ్య అతిథులుగా హాజరైన శ్రావణి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ గూడూరు మండలంలోని చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు అత్యధిక మార్కులు సాధించి రికార్డు సాధించారన్నారు. తాను కూడా ఇదే పాఠశాల చదివానని పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అంతేకాకుండా ఎమ్మెల్యే సునీల్ కుమార్ సహాయ సహకారాలతో మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆత్మకూరు సురేష్, సభ్యులు మల్లి, సాయి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోలా, ఉపాధ్యాయులు విద్యార్థు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులంలో ఇంటర్ విద్యార్థులకు దరఖాస్తులు

కోట,మే 6 ప్రభాతవార్త : మండలం చిట్టేడులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ ఇంటర్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొచ్చని ప్రిన్సిపల్ శేషవర్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.10 పదవ తరగతిలో గిరిజన తెగకు చెందిన ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలో విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొచ్చన్నారు. ఎంపిసిలో 40, బైసిసిలో 40 జనరల్ గ్రూపుల్లో ఐదు సీట్లు ఉంటాయన్నారు.ఓసీ,బిసి ఎస్సీ ఒక్కొక్కటి చొప్పన కేటాయించడం జరుగుతందన్నారు.ఈనెల 18లోగా దరఖాస్తులు చేసుకొవాలన్నారు. మరిన్ని వివరాలు కొరకు9441033367 సంప్రదించాలన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

పెళ్లకూరు, మే 6 ప్రభాతవార్త : సచివాలయ ఎంఎల్ హెచ్ పీలు పీహెచ్ సీ లలో పనిచేసే ఏఎన్ఎం, సూపర్‌వైజర్ తదితర ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యాలకు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకట శివారెడ్డి, భూలక్ష్మి, ఇందిర తదితరులు ఉన్నారు.

సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం

వెంకటగిరి, మే 6 ప్రభాతవార్త : చెత్త నుండి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీల అభివృద్ధికి ఆదాయం వస్తుందని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ తెలిపారు. మండలంలోని డిఎల్పిఓ దత్తత తీసుకున్న పంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. దత్తత తీసుకున్న సోమసానిగుంట, వల్లివేడు షెడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి షెడ్లు పునరోద్ధరణ వెంటనే చేపట్టాలని సూచించారు. షెడ్డు ప్రాంగణంలో మొక్కలు నాటారు.షెడ్డు ప్రాంగణాన్ని మట్టితోలి చదును చేయించడం జరిగింది. వల్లివేడు ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ ప్రహరీ గోడ నిర్మాణం నూతనంగా గేట్ ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకి తడి చెత్త పొడి చేత్త పై అవగాహన కల్పించారు. తదితర పనులు చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.వి రమణయ్య, డిఆర్పి శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

వెంకటగిరి, మే 6 ప్రభాతవార్త : మున్సిపల్ సిబ్బందికి పదవి విరమణ వయసు 62 సంవత్సరాలు పెంచాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వద్దుపల్లి చంగయ్య కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో రెండవ రోజు కూడా వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. ధర్నా నుద్దేశించి ఆయన మాట్లాడుతూ గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అన్నిటికీ వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం మున్సిపల్ కార్మికుల జీవితాలు మెరుగుపడే విధంగా అందరినీ పర్మిట్ చేయాలని అన్నారు. ఒప్పందాలలో భాగంగా రిటైర్మెంట్ బెన్ఫిట్ ఇస్తామని చెప్పారని ఒప్పందం కుదిరిందని కానీ ఇంతవరకు జీవో ఇవ్వలేదని వెంటనే జీవో ఇవ్వాలని అన్నారు. రిటైర్మెంట్ మరియు మరణించిన వారు మరియు అనారోగ్య పాలైన వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వెంకటగిరి మండల ఉపాధ్యక్షులు ఎంవి రమణ, మున్సిపల్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ పెంచలయ్య, వెంకటగిరి పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య కార్యదర్శి ఎస్ ప్రసాద్, నాయకులు పి.రమణయ్య, శుభ రత్నమ్మ, ఇందరమ్మ, సీతారాం ఏచూరి నగర్ పోరాట కమిటీ నాయకులు రాజయ్య, నవీన్, యేసు పాదం తదితరులు పాల్గొనడం జరిగింది.

ప్రభుత్వ భూమి కబ్జా

వెంకటగిరి, మే 6 ప్రభాతవార్త పట్టణంలోని సినిమా థియేటర్ల కోడలు వద్ద ఉన్న 48 సెంట్లు ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారు. 48 సెంట్లు భూమిని లిజ్ పట్టా గతంలో నీరుకట్టు పోలయ్య అనే నిరుపేద దళిత కుటుంబానికి చెందిన వ్యక్తికి ఇచ్చారు. అయితే ఈ భూమి రికార్డులు తారుమారు చేసి కొందరు కబ్జా చేశారు. అక్రమంగా రూములను కూడా నిర్మించారు. అనుమతి లేకుండా నిర్మించారు. అనంతరం మున్సిపాలిటీ వారు దీన్ని క్రమబద్ధీకరించారు. దాదాపు 50 కోట్ల రూపాయల విలువచేసే ఈ భూమిని ఆక్రమించిన అధికారులు పట్టించుకోలేదు. ఈ స్థలాన్ని ప్లాట్లు వేసి విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలం రోడ్డు మార్గంలో దుకాణాలు పెట్టుకున్న వారిని ఖాళీ చేయమని కబ్జాదాలు బెదిరిస్తున్నట్లు వాపోయారు. గతంలో ఈ స్థలం ప్రభుత్వం దేనిని కోర్టు తీర్పు ఇచ్చారు. ఈ స్థలం ప్రభుత్వం దని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు చర్య తీసుకొని ఈ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు

రామకుప్పం, మే 6 ప్రభాతవార్త : మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. రామాపురం తాండా అటవీ సరిహద్దుల్లో రైతులు గోవిందనాయక్, రామదాస్ నాయక్, శివకుమార్ నాయక్, కాంగ్రెస్ నాయక్, శంకర నాయక్ తదితరులు సాగు చేస్తున్న వరి పంటను నాశనం చేశాయి. పంటలు చేతికందే సమయంలో ఏనుగులు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఏనుగుల దారి మళ్లింపుకు అటవీ అధికారులు, సిబ్బంది విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. చీకటిపడగానే ఏనుగులు మరలా పంటలపై పడుతున్నాయి.

గజవాహనంపై విహరించిన అగస్తీశ్వరుడు

నారాయణవనం, మే 6 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో ప్రసిద్ధి చెందిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు మంగళవారం రాత్రి పురవీధుల్లో గజవాహనాన్ని అదిరోహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రవి, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు రమేష్ గురుకుల్, రమణిగురుకల్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నార.

ఘనంగా కోయిల్ ఆల్వార్ తిరుమంజనం

నారాయణవనం, మే 6 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన తితిదే ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించే కోయిల్ ఆల్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 11వతేది నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, కైలాసం, అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్యులు, నరసింహభట్టాచార్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన చిన్న కొట్టాయ్ ఉత్సవాలు



శ్రీకాళహస్తి, మే 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం నుంచి చిన్న కొట్టాయ్ ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయ అంకార మండపం నుంచి స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను బయటకు తీసుకువచ్చి సర్వాంగ సుందరంగా అలంకరించారు. వెట్టువేర్లు ఉన్న పట్టలను చుట్టుపక్కల కట్టి స్వామి అమ్మవార్లకు చిన్న కొట్టాయ్ ఉత్సవాన్ని నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఇఓ బాపిరెడ్డితో పాటు టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్,సంబంధం గురుకుల్, సిఎస్ఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా అయూబ్ ఖాన్, గురవయ్య

తిరుపతి కలెక్టరేట్, మే 6 ప్రభాతవార్త : ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ (ఏపీఎస్పీడీసీఎల్) డైరెక్టర్లుగా పి. అయూబ్‌ఖాన్, కె. గురవయ్యలను నియమిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్పీడీసీఎల్ లో చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో ఈ ఏడాది ఏప్రిల్ 30న పదవి విరమణ పొందిన పి. అయూబ్‌ఖాన్‌ను డైరెక్టర్ ప్రాజెక్ట్స్‌గా నియమించింది. అదే విధంగా ఏపీఎస్పీడీసీఎల్‌లో చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో గత ఏడాది 31న పదవి విరమణ పొందిన కె. గురవయ్యను డైరెక్టర్ (టెక్నికల్)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వారు బాధ్యతలను స్వీకరించనున్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి

కోట, మే 6 ప్రభాతవార్త : మండలం చిట్టేడు పంచాయతీ మైక్రోటవర్ కాలనీ సమీపంలో మంగళవారం రొయ్యల ఫ్యాక్టరీ వద్ద ఓ దుప్పి కుక్కల దాడిలో మృతిచెందింది. దాహార్తి తీర్చుకునేందుకు దుప్పి రావడంతో ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. సమాచారం తెలుసుకున్న కడివేడు బీట్ ఆఫీసర్లు జి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయాలతో ఉన్న దుప్పిని సమీపంలోని విద్యానగర్‌లో ఉన్న పశువైద్యశాలకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పటికే ఆ దుప్పి మృతిచెందింది. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

కోట తెలుగుదేశం పార్టీలో అంతర్మధనం

కోట, మే 6 ప్రభాతవార్త : మండల తెలుగుదేశం పార్టీలో రాజకీయ వేడి రగులుతోంది. ఇటీవల కోట మండల పార్టీ అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి పార్టీ సభ్యత్వానికి, మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ నెల 5వ తేదీన సర్వోత్తమరెడ్డి నివాసానికి చేరుకొని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీలో చిన్న చిన్న మనస్పర్థలు ఉంటాయని, సర్దుకుపోవాలని సూచించారు. అయితే మండల అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి సర్వోత్తమరెడ్డి ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో అని కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు నెలల వరకు సర్వోత్తమరెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం మూడు నెలల నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా కూడా చేశారు. ఒక్కసారిగా మళ్లీ సర్వోత్తమరెడ్డి తెరపైకి రావడంతో పార్టీ వర్గాల్లో అసలేమి జరిగింది, ఎందుకు రాజీనామా చేశారు ? మళ్లీ ఎమ్మెల్యే పార్టీలోకి ఎందుకు ఆహ్వానించారంటూ ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. అందరూ సర్వోత్తమరెడ్డికి సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ నాలుగు నెలల పాటు జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఆదేశాలతో కోట మండలంలోని అధికార కార్యక్రమాలన్నీ తానై చూసుకుంటూ ఉత్సాహంగా పార్టీ కార్యకర్తలను ముందుకు నడిపిస్తున్నారు. అయితే ఈ నెల 27 నుంచి మూడురోజులు పాటు కడపలో జరగనున్న మహానాడు సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎవరిని ప్రకటిస్తారన్నది పార్టీ నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. నూతన అధ్యక్షుడిని నియమిస్తారా లేకుంటే సర్వోత్తమరెడ్డినే కొనసాగిస్తారా అన్నది ఆ పార్టీలో చర్చనీయాంవమైంది.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

కోట,మే 6 ప్రభాతవార్త : రాష్ట్రంలో నేటి నుంచి కొత్త రేషన్ కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తారని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపలి రాధకృష్ణారెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం కోటలో విలేకర్లతో మాట్లాడారు. కొత్త కార్డులుజారీ, రేషన్ కార్డు స్ప్లిట్,కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే ఈ కార్డు వెసులబాటు ఉంటుందన్నారు. నెల రోజుల పాటు ఈ రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. గ్రామ సచివాలయాలకు వెళ్లి ప్రజలు తమ వివరాలు తెలుసుకొచ్చున్నారు.

పేటలో ప్రారంభమైన పోలేరమ్మ జాతర ...

నాయుడుపేట, మే 6 ప్రభాతవార్త : గ్రామదేవత పోలేరమ్మ జాతర ఏర్పాట్లును మంగళవారం నుండి ఆలయ అధికారులు,కమిటిసభ్యులు పర్యవేక్షిస్తున్నారు. పోలేరమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ చలువపందిళ్ళు, తాగునీరు, క్యూలైన్లు ఏర్పాటుచేసి అమ్మవారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. మంగళవారం రాత్రి సప్పరం పట్టణ పురవీధుల్లో ఊరేగింపు, అనంతరం నిలుపు చేయడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని ధర్శించుకొని మొక్కులు చెల్లించవచ్చునని ఆయల అధికారులు రవికృష్ణ తెలియజేశారు. పోలేరమ్మ జాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండ నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు ఆధ్వర్యంలో 274మంది పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిల్లకూరు, మే 6 ప్రభాతవార్త : మండలం బల్లవోలు గ్రామం నందు ఈ నెల నాలుగో తేదీన ప్రమాదవశాత్తు పూరిల్లు కాలిపోయినటువంటి పిట్ల నాగభూషణం అను వారి ఇంటి వద్దకు చిల్లకూరు మండల తహశీల్దార్ కె.శ్రీనివాసులు, స్థానిక వీఆర్వో గిరీష్ చంద్ర స్థానిక టిడిపి నాయకుడు ఉప సర్పంచ్ దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డితో కలసి వచ్చారు. సంఘటన జరిగిన తీరును స్థానిక వీఆర్ఏ, వీఆర్వో ద్వారా తెలుసుకొని ఉప సర్పంచ్ డి.వినయ్ కుమార్‌రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి బియ్యం బస్తా, నిత్యవసర సరుకులు, దుప్పట్లు, పంపిణీ చేసారు. బాధితు కుటుంబానికి తన వంతు సాయంగా 5000 రూపాయలను సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దువ్వూరు రామచంద్రారెడ్డి చెరుకూరు పద్మజ, వేదనపర్తి జయచంద్రారెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు చాకర లక్ష్మీనరసింహం సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు ధర్మయ్య దేశయ్య మరియు టిడిపి కార్యకర్తలు కొట్టు రమేష్, డి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాధితుడు పిట్ల నాగభూషణం నిరాశ్రయులమైన మాకు సహాయం చేసిన తహ సిల్దార్ కే శ్రీనివాసులు, విఆర్ఓ గిరీష్ చంద్ర, ఉప సర్పంచ్ వినయ్ కుమార్ రెడ్డి, అందరు టిడిపి నాయకులకు, కార్యకర్తలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

దోపిడీ నేరంలో ముద్దాయిలు అరెస్ట్

ఒక మోటారు సైకిల్, రూ. 2.00 లక్షలు స్వాధీనం

పుత్తూరు, మే 6 ప్రభాతవార్త: పట్టణంలో ఒక వ్యాపారిని కత్తితో బెదిరించి దోపిడీకి పాల్పడిన ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్టు పుత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.వి.సురేంద్రనాయుడు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన దోపిడి జరిగిన తీరు, అరెస్ట్ తదితర వివరాలను తెలిపారు. పుత్తూరు పట్టణంలో ఎన్టీఆర్ కాలనీ వద్ద ఈశ్వరి కల్యాణమండపం పక్కన పాన్ మసాలాలు విక్రయించేందుకు ఒక గొడౌన్‌లో మీనాక్షి ఏజెన్సీని మహేంద్ర అనే వ్యక్తి నడుపుతున్నారు. పిచ్చాటూరు పట్టణానికి చెందిన మునికృష్ణ అనే వ్యక్తి మహేంద్ర వద్ద గుల్కా, హాన్స్ ప్యాకెట్లు కొనుగోలు చేసి పిచ్చాటూరులో విక్రయించేవాడు. ప్రతి నెల మునికృష్ణ కుమారుడు ఠాగూర్ గొడౌన్‌కు వచ్చి 4 నుంచి 5 లక్షల రూపాయలకు గుట్కా, హాన్స్ ప్యాకెట్లు కొని తీసుకెళ్లేవాడు. ఈ నేపథ్యంలో ఠాగూర్ తన గ్రామానికి చెందిన పాండియన్, మోటారు సైకిల్ మెకానిక్ రసూల్, అతని ద్వారా పరిచయమైన గుమ్మిడిపూండికి చెందిన దినేష్‌లతో కలిసి మద్యం తాగడానికి, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాడు పడ్డాడు. జల్సాలకు డబ్బులు చాలకపోవడం వల్ల అప్పులు కూడా చేశారు. అప్పులిచ్చిన వారి వత్తిడి భరించలేక ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గుట్కా గొడౌన్‌లో చాలా డబ్బులుంటాయని, వాటిని దొంగిలిస్తే బాగుంటుందని ఠాగూర్ తన మిత్రులతో చెప్పడంతో దానికి దినేష్ అంగీకరించాడు. ఆ మేరకు ఒక ప్లాన్ వేశారు. ప్రతి నెల జరుగుతున్న విధంగా తాను గొడౌన్‌కు వెళ్లి డబ్బులు చెల్లించి సరుకు కొంటానని, తర్వాత మిగిలిన వాళ్లు వెళ్లి గొడౌన్‌లో డబ్బు దొంగిలించాలని పథకం పన్నారు. అందులో భాగంగా ఈ నెల 19వ తేదీన ఉదయం ఏడు గంటల సమయంలో చోరీ విషయం చెప్పకుండా తన మామ ఏలుమలైతో కలిసి పిచ్చాటూరు నుంచి బొలెరో వాహనంలో బయలుదేరాడు. ఈ వాహనానికి కొంత దూరంలో వెనుకనే జగన్, పాండియన్, దినేష్‌లు మోటారుసైకిల్‌పై పుత్తూరుకు చేరుకుని గొడౌన్‌కు సమీపంలో వేచివున్నారు. ఠాగూర్ అతని మామ ఏలుమలై గొడౌన్‌కు వెళ్లి ఎప్పటిలాగే రూ. 4.30,000 లక్షలు చెల్లించి గుట్కా ప్యాకెట్లు కొనుగోలు చేసి వెళ్లిపోయారు. గొడౌన్ బయటకు రాగానే ఠాగూర్ తన మిత్రులకు ఫోన్ చేసి ఇపుడే డబ్బులు చెల్లించాను, గొడౌన్‌లో డబ్బులున్నాయని సమాచారం అందించాడు. దాంతో జగన్, పాండియన్, దినేష్‌లు ముగ్గురూ బుల్లెట్ వాహనంపై గొడౌన్‌కు వెళ్లారు. పాండియన్ మోటారుసైకిల్‌పై బయట వేచి వుండగా, జగన్, దినేష్‌లు గొడౌన్‌లోకి వెళ్లి క్యాష్ కౌంటర్ వద్ద వున్న మహేంద్రకు కత్తి చూపించి డబ్బులు అడి గారు. అందుకు మహేంద్ర నిరాకరించగా జగన్ కత్తితో మహేంద్ర కుడి భుజంపై నొక్కాడు, గొడౌన్‌లో కూలి పని చేసే సునీల్ అడ్డుకోగా అతనిని కొట్టి, ఎడమ కాలిపై కత్తితో గాయం చేశాడు. అక్కడే వున్న ఠాగూర్‌పై ఎవరికీ అనుమానం కలగకుండా వుండేందుకు...ఠాగూర్‌కు కత్తి చూపించి చేత్తో కొట్టారు. దాంతో మహేంద్ర క్యాష్ కౌంటర్ నుంచి దూరంగా వెళ్లడంతో జగన్, దినేష్ లిరువురూ క్యాష్ కౌంటర్లో వున్న రూ. 6,30,000 లక్షలు దోచుకుని గొడౌన్ బయట బుల్లెట్ వాహనంపై వున్న పాండియన్‌తో కలిసి ఆర్టీసి బస్టాండ్ వైపు వెళుతుండగా, అదే సమయంలో గొడౌన్ వద్దకు వచ్చిన మహేంద్ర తమ్ముడు లోకేష్ వారిని వెంబడించగా వారు తప్పించుకుని పారిపోయారు. చోరీ చేసిన సొమ్ములో ఠాగూర్ రూ. 2,20,000 లక్షలు, పాండియన్ రూ. 2.10.000 లక్షలు, దినేష్ రూ. 1,00,000 వేలు, జగన్ రూ. 1,00,000 వేలు పంచుకున్నారు. అదే రోజు జగన్, దినేష్ కలిసి చెన్నైకి వెళ్లారు. ఠాగూర్, పాండియన్‌లు స్థానికంగా వుంటూ చోరీ సొమ్ముతో జల్సాలు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఠాగూర్, పాండియన్‌లు ఇద్దరూ రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై చెన్నైకు వెళుతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి రూ.2,00,000లక్షలు, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ ...
రాత పరీక్షకు 611 మంది హాజరు

తిరుపతి కలెక్టరేట్, మే 6 ప్రభాతవార్త : జిల్లాలో మంగళవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఈ పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 611 మంది అభ్యర్థులు (67.07 శాతం) హాజరయ్యారని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో జరిగాయని, 911 అభ్యర్థులకు గాను 611 మంది హాజరు కాగా 300 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే అభ్యర్థులు వేసవిలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

తిరుపతి హెల్త్, మే 6 ప్రభాతవార్త : కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వీర పాండ్యన్ ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కలిసి వైద్య ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీ ఎంఎస్ఐడీసీ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి. వీర పాండ్యన్‌ని కలిసిన ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించి వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. గిరిబాబు, రాష్ట్ర కార్యవర్గ నిర్వాహక అధ్యక్షుడు ఎం. బాలరాజు నాయుడు, జిల్లా అధ్యక్షులు వీర కిరణ్, జిల్లా కార్యదర్శి ఏకేశ్వర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి లోకయ్యానాయుడు, తిరుపతి బ్రాంచ్ ప్రెసిడెంట్ కె. ప్రభాకర్, నాయకులు లోకేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో పాటుగా... ఈదురు గాలులు

అల్లాడుతున్న రైతన్నలు- దెబ్బతిన్న వరినాట్లు

బుచ్చినాయుడు కండ్రిగ, మే 6 ప్రభాతవార్త: మంగళవారం సాయంత్రం ఒక్క సారిగా ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో గత పది రోజుల నుంచి వరి నాట్లు నాటుతున్న పంట పొలాలు దెబ్బతిన్నాయి. కష్టపడి వ్యవసాయ సాగు చేసుకున్న రైతులకు మే నెలలో కూడా వర్షాలు పడతాయన ఇబ్బంది కలుగుతుందని ఊహించలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ నిలిచిపోయి ప్రజలు ఇళ్ళలో చీకట్లో అల్లాడారు. ఈ అకాల వర్షం వలన మిరప పంటకు కూడా నష్టం జరుగుతుందని, ప్రకృతి పరంగా రైతులకు మేలు ఎంత జరుగుతుందో కష్టం కూడా అంతే జరుగుతుందనినష్టపోయిన రైతులను ఆదుకునే వారే లేరని రైతులు వాపోతున్నారు. ఈ అకాల వర్షం వలన గత పది రోజులుగా నాటుతున్న వరినాట్లు నీటమునిగి గండ్లు పడిదెబ్బతిని రైతుల నష్టపోతున్నారన్నారు. ఈ అకాల వర్షం సుమారుగంటపైనే ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కూడిన వాన బీభత్సవం సృష్టించడం జరిగింది. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఏదీ ఏమైనా అన్ని కాలాల్లో అన్ని విధాల నష్టపోయేది అన్నదాతల మాత్రమే ప్రభుత్వాలు ఆదుకునేది కూతు మంత్రమే.

రావణుడిపై శివపార్వతుల చిద్విలాపం

చౌడేపల్లి, మే 6 ప్రభాతవార్త: అభీష్టధ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతులు రావణుడిపై ఊరేగారు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు, శివకుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. రాత్రి వినాయకస్వామి సమేత శివపార్వతులు రావణవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవకు సజ్జనకులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయము, వాహనాలను వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

చిత్తూరు ఆసుపత్రిలో ఏం జరుగుతోంది!

- ఎంఓయులో వున్న మేరకు రోగులకు వైద్యం అందుతున్నదా! - పరిశీలించి నివేదిక సిద్ధం చేసి ఇవ్వండి - డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలిని ఆదేశించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్

చిత్తూరు, మే 6 ప్రభాతవార్త: చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిపై అపోలో చేసుకున్న ఎంఓయు ఎంటీ! అపోలో యాజమాన్యం ఎంఓయులో పేర్కొన్న మేరకు వైద్య సేవలు అందిస్తున్నారా! ఆసుపత్రి నిర్వహణ కోసం ప్రభుత్వ నిధులు ఎంత ఖర్చు అవుతున్నాయి! అపోలో యాజమాన్యం ఎంత ఖర్చు చేస్తోంది! ఇప్పటి వరకు అపోలో సంస్థ ఆసుపత్రిలో చేసిన మార్పులు ఏంటీ! రోగులకు అందిస్తున్న వైద్య సేవలు ఏంటీ! అనే విషయాలను సమగ్రంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలిని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలపై ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలిని ప్రశ్నించారు. ఈ విషయంపై డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి మాట్లాడుతూ అపోలో సంస్థకు ప్రభుత్వంకు వున్న ఎంఓయు తాను ఇప్పటి వరకు చూడలేదని, దీనిపై పరిశీలించి అపోలో సంస్థ ఆసుపత్రిలో ఇప్పటి వరకు ఏం చేసింది! ఇక చేయాల్సింది ఏం చేయాలి! అనే విషయాలను నివేదిక రూపంలో అందజేస్తామన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి రెఫరల్ శాతం ఎక్కువగా వుంటున్నదని, ఇక్కడ సరైన డాక్టర్లు అందుబాటులో వుండటం లేదని, డాక్టర్ల సంఖ్య తక్కువగా వుండి పారా మెడికల్ సిబ్బంది సంఖ్య ఎక్కువగా వుందని, ఈ విషయంపై దర్యాప్తు నిర్వహించి నివేదిక ఇవ్వాలన్నారు. ఇటీవల చిత్తూరు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతో అధికార పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత కుమార్తె మృతి చెందిందని ప్రభుత్వంలో వున్న నేత పరిస్థితే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలా వుంటే మరి సామాన్య రోగుల పరిస్థితి ఎలా వుంటుందో ఒకసారి ఊహించుకోవాలన్నారు. ఈ మేరకు ఆసుపత్రిలో అపోలో సంస్థ ఇప్పటి వరకు చేసిన పనులపై నివేదిక ఇస్తే తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గజ వాహనంపై ఊరేగుతున్న బోలా శంకరుడు

పుత్తూరు రూరల్, మే 6 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా మంగళవారం స్వామి, అమ్మవారు గజ వాహనంపై ఊరేగించారు. ఉదయం ఆయలంలో విఘ్నేశ్వర పూజ కలశ పూజ ప్రత్యేక హోమాలు అనంతరం స్వామి,అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఆలయ ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి స్వామి,అమ్మవార్లను గజ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మంగళ నీరాజనాలు సమర్పించారు.